ప్రజాశక్తి

మంగళవారం 30 ఏప్రిల్ 2024

8 పేజీలు




విశాఖపట్నం



అనకాపల్లి

ఇక సమరమే..!



- మిగిసిన నామినేషన్ల ఉపసంహరణ
- మాడుగులలో పోటీ నుంచి తప్పుకున్న పైలా
- బరిలో అనకాపల్లి లోక్‌సభకు 15, అసెంబ్లీ స్థానాలకు 54 మంది
- విశాఖ లోక్‌సభకు 33 మంది, అసెంబ్లీ స్థానాలకు 100కు పైగా...

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, విలేకరులు

సార్వత్రిక ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ ఉపసంహరణ గడువు సోమవారంతో ముగిసింది. బతిమలాట, బుజ్జగింపుల ప్రక్రియ పూర్తవడంతో బరిలో ఉన్న అభ్యర్థులు మంగళవారం నుంచి పూర్తిగా ప్రచారంపై కేంద్రీకరించనున్నారు. మాడుగుల టిడిపి టికెట్ పైలా ప్రసాదరావుకు కేటాయించి, తరువాత ఆయన బదులు ఆ పార్టీ సీనియర్ నాయకుడు బండారు సత్యనారాయణమూర్తికి ఇవ్వడంతో అవమానానికి గురైన పైలా బరిలో ఉంటానంటూ వెనక్కుతగ్గారు. టిడిపి నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాలు పెట్టి తన శక్తిని చాటుకుంటానని చెప్పి, పోటీ నుంచి తప్పుకొని తన బలహీనతను చూపించుకున్నారు. అనకాపల్లి బిజెపి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్, మాడుగుల టిడిపి అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడుపై నిప్పులు చెరిగిన పైలా ఒక్కసారి చల్లబడిపోయారు. కూటమి అభ్యర్థులతో ఇంతవరకు కాలుదువ్విన ఆయన ఏ మేరకు కలిసి పనిచేయగలుగుతారో అని ఇప్పుడు మాడుగుల నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది. టిడిపిలో అన్యాయం జరిగిన పైలాకు వెన్నుదన్నుగా నిలబడిన నియోజకవర్గ టిడిపి శ్రేణులన్నీ, ఆయన నామినేషన్ ఉపసంహరణతో డీలాపడ్డాయి.

అనకాపల్లి లోక్‌సభకు నామినేషన్ వేసిన 22 మందిలో ఏడుగురు తమ నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో 15 మంది రంగంలో మిగిలారు. బరిలోని 15 మందిలో వైసిపి అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఇండియా వేదిక తరపున కాంగ్రెస్ అభ్యర్థి వేగి వెంకటేష్, కూటమి నుంచి బిజెపి అభ్యర్థి సిఎం రమేష్ సహా 12 మంది ఉన్నారు. పైలా ప్రసాదరావు, కోన గురవయ్య, గవిరెడ్డి రమాదేవి, లాలం కన్నాజీ, వంటాకు సురేష్, ఎస్‌కె సబీవుల్లా, లంబ శ్రీనివాసరావు తమ నామినేషన్ ఉపసంహరించుకున్నారు.

జిల్లాలోని ఆరు మిగతా 2లో..



చోడవరం సిద్ధం సభలో అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

బాబును నమ్మితే..

కొండచిలువ నోట్లో తలకాయ పెట్టినట్లే

2014లో ఈ కూటమి ఇచ్చిన హామీల అమలు ఏదీ?

వైసిపితోనే సంక్షేమం

చోడవరం సిద్ధం సభలో సిఎం జగన్

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : 'చంద్రబాబును నమ్మితే కొండ చిలువ నోట్లో తలకాయ పెట్టినట్లే. సాధ్యంకాని హామీలిచ్చి అమలుచేయకుండా మోసగిస్తాడు. ఇది ఆయన గత చరిత్ర చెబుతున్న సత్యం'. అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విమర్శించారు. అనకాపల్లి జిల్లా చోడవరం కొత్తూరు జంక్షన్‌లో సోమవారం మేమంతా సిద్ధం సభ నిర్వహించారు. ఈ సభకు పరిసర గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ సభలో జగన్మోహన్‌రెడ్డి చంద్రబాబుపై పలు విమర్శలు చేశారు. ఇచ్చిన హామీలేవీ నెరవేర్చే వ్యక్తి చంద్రబాబు కాదన్నారు. 2014లో ఇదే కూటమి ఇచ్చిన హామీలేమైనా అమలుచేశాడా అని ప్రశ్నించారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయి పదేళ్లు ఉమ్మడి రాజధానిగా ఉండాల్సిన హైదరాబాద్‌ను వదిలి ఇక్కడి పరుగెత్తుకొచ్చాడని విమర్శించారు. చంద్రబాబు సిఎంగా ఉన్న 14 ఏళ్లలో దోచుకోవడం, దోచుకున్నది దాచుకోవడం తప్ప చేసేందేమిలేదన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్మోహన్‌రెడ్డి అధికారంలో ఉండాలన్నారు.

(ప్రధాన వార్త మెయిన్‌లో..)

ప్రజల భాగస్వామ్యంతో వికసిత్ భారత్ : నిర్మలా సీతారామన్

వార్త మెయిన్‌లో..

మల్కాపురం సిఐ సన్యాసినాయుడు సస్పెన్షన్

వార్త మెయిన్‌లో..

సరుగుడు తోట దగ్ధం

వార్త 6లో..

నివాసాలకు అనువుగా లేక నిర్మాణాలకు నోచని గృహాలు

వార్త 7లో..

టిడిపి తప్పుడు ప్రకటనలను ఖండించిన సిపిఎం

- బిజెపితో అంటకాగుతున్న తెలుగుదేశానికి గాజువాకలో పోటీ చేసే అర్హత లేదు
- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంగారావు

ప్రజాశక్తి-గాజువాక : జివిఎంసి ఎన్నికల్లో సిపిఎం, సిపిఐ అభ్యర్థులకు తెలుగుదేశం మద్దతు ఇచ్చిందని, అందువల్ల గాజువాక నియోజకవర్గంలో సిపిఎం పోటీ నుంచి వైదొలగి టిడిపికి మద్దతు ఇవ్వాలని ఆ పార్టీకి చెందిన కొంతమంది చేస్తున్న తప్పుడు ప్రకటనను సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు ఖండించారు. వాస్తవంగా జివిఎంసి ఎన్నికల్లో సిసిఎం, సిపిఐ మద్దతుతో 30 కార్పొరేటర్లను గెలిపి టిడిపి రాజకీయ లబ్ది పొందిందని పేర్కొన్నారు. ఆ రోజు బిజెపిని టిడిపి వ్యతిరేకించడం వల్ల వామపక్షాలు ఆ పార్టీకి మద్దతు ఇచ్చాయని గుర్తుచేశారు. వామపక్షాల ఓట్లతో గెలిచి ఇప్పుడు దిగజారుడు ప్రకటనలు చేయడం సిగ్గు చేటు అని పేర్కొన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా గత మూడున్నరేళ్లుగా సిపిఎం పోరాడుతోందని తెలిపారు. ఈ ఎన్నికల్లో బిజెపికి టిడిపి లొంగిపోయి పొత్తు పెట్టుకొని స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి మద్దతు ఇస్తూ కార్మికులకు తీవ్ర ద్రోహం చేసిందని విమర్శించారు. అందువల్ల గాజువాకలో టిడిపికి పోటీచేసే అర్హత ఏమాత్రం లేదని పేర్కొన్నారు. తక్షణం టిడిపి అభ్యర్థి పోటీ నుంచి వైదొలగి ఇండియా ఫోరం బలపర్చిన సిపిఎం అభ్యర్థి మరడాన జగ్గునాయుడుకు మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడాలంటే గాజువాకలో సిపిఎం గెలవాలని పేర్కొన్నారు. టిడిపి, వైసిపికి ఎవరికి ఓటేసిన స్టీల్ ప్లాంట్ అమ్మకానికి మద్దతు ఇచ్చినట్లేనని తెలిపారు. బిజెపికి భజన చేస్తున్న టిడిపి, వైసిపిలను గాజువాకలో ఓడించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

కమ్యూనిస్టులను గెలిపిస్తేనే ప్రభుత్వ రంగానికి రక్షణ

చైతన్య యాత్రలో వడ్డే శోభనాద్రీశ్వరరావు, చలసాని, సిపిఎం, సిపిఐ నేతలు

ప్రజాశక్తి గ్రేటర్ విశాఖ బ్యూరో / మల్కాపురం

కమ్యూనిస్టులను గెలిపిస్తేనే ప్రభుత్వ రంగానికి రక్షణ ఉంటుందని భారత రాజ్యాంగ హక్కుల వేదిక కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, చలసాని శ్రీనివాసరావు సంయుక్తగా ఉద్ఘాటించారు.. మల్కాపురంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన సభలో ఇండియా వేదిక బలపరచిన సిపిఐ అభ్యర్థి విమల, గాజువాక సిపిఎం అభ్యర్థి జగ్గునాయుడు అభ్యర్థుల గెలుపు కోరుతూ ప్రసంగించారు. ప్రజల కోసం పోరాటం చేసే వాళ్లకే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో మూడు లక్షలు, తమిళనాడులో 4 లక్షలు ఉద్యోగాలు ఇస్తే ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఒక ఉద్యోగం కూడా ఇవ్వలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. అగ్రిగోల్డ్‌లో సుమారు రూ.1000 కోట్లను పోరాటాలు, నిరాహార దీక్షల ద్వారా సిపిఐ, సిపిఎం వెనక్కి రప్పించిన విషయాన్ని గుర్తుచేశారు. లబ్ధి పొందిన



గాజువాకలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

వారంతా పోరాటం చేసిన వారికి కాకుండా మాయమాటలు చెప్పే వారికి ఓట్లు వేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎక్కడో ఉన్నవారిని విశాఖ తీసుకొచ్చి పోటీలో నిలిపే పరిస్థితిని నేడు ఆ పార్టీలు తీసుకొచ్చాయన్నారు. ఎక్కడో హైదరాబాదులో కూర్చొని పాలించే వారిని ఎన్నుకుంటున్నారో, లేక ఇక్కడే ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల కోసం పోరాటం చేసే వారిని ఎన్నుకుంటారో ప్రజలు తేల్చుకోవాలన్నారు. అంబేద్కర్ సారథ్యంలో మేధావులంతా కలిసి ఆదేశిక సూత్రాలను పొందుపరిచారని, నేడు వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని చెప్పారు. ఇండియా కూటమి తరపున పశ్చిమం నుంచి పోటీ చేస్తున్న విమలను, గాజువాక నుంచి పోటీ చేస్తున్న జగ్గునాయుడును, విశాఖ ఎంపీగా సత్యారెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, సిపిఐ రాష్ట్ర నాయకులు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

కమ్యూనిస్టులను గెలిపిస్తేనే ప్రభుత్వ రంగానికి రక్షణ

జెవి.సత్యనారాయణమూర్తి, ఎం.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు. వందల సంఖ్యలో జనం ఈ సభకు విచ్చేశారు..

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలంటే సిపిఎం గెలవాలి

భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలంటే గాజువాక ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న సిపిఎం అభ్యర్థి ఎం.జగ్గునాయుడును గెలిపించుకోవాలని వడ్డే శోభనాదీశ్వరరావు పిలుపునిచ్చారు. గాజువాకలోని ఎస్‌బిటి హోటల్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో బిజెపి దానికి అనుకూలంగా వ్యవహరిస్తున్న పార్టీలను ఓడించాలని కోరారు. లేకపోతే భారత రాజ్యాంగానికి తీవ్ర ఉల్లంఘన జరుగుతుందన్నారు.

సిపిఎం అభ్యర్థి ఎం జగ్గునాయుడు మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం సిపిఎం తరపున పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. గంగవరం పోర్టు, విశాఖ డెయిరీ, ఫార్మాసిటీ కాలుష్య నివారణకు, గాజువాక ఇనాం భూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బిజెపి ప్రభుత్వం రద్దు చేసిన కార్మిక చట్టాలను పునరుద్ధరించడానికి పోరాటం చేస్తామన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ కె.విజయరావు, సిపిఐ కార్పొరేటర్ స్టాలిన్, పూర్వపు సీనియర్ పాత్రికేయులు జివి.రంగారెడ్డి, సిపిఎం జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, గూడూరు సీతామహాలక్ష్మి, పొన్నాడ శ్రీనివాసరావు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి బండ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి వేసవి కిట్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఎండల తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు మండుటెండలో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు థర్మల్ వాటర్ బాటిళ్లు, నాప్కిన్లు, చలువ కళ్లద్దాలు, తెలుపు టోపీలు, మజ్జిగ ప్యాకెట్లను సిపి ఎ.రవిశంకర్, జాయింట్ సిపి ఫకీరప్ప అందించారు. యంగ్ ఇండియన్స్ ఎన్జీవో సహకారంతో హార్మొనీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సిఎస్ఆర్ యాక్టివిటీలో భాగముగా 66 ఎమర్జెన్సీ ట్రామా కిట్లను కూడా ట్రాఫిక్ పోలీసులకు అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ మాట్లాడుతూ, సీపీ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ. 2,65,000 వెచ్చించి థర్మల్ వాటర్ బాటిళ్లు, నాప్కిన్లు, చలువ కళ్లద్దాలు, తెలుపు టోపీలు కొనుగోలుచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎడిసిపి, ట్రాఫిక్ ఎసిపి–1 విరాట్ మహేశ్వరి, హార్మొనీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ రాయ్ కొడాలి పాల్గొన్నారు.

19వ వార్డులో వెలగపూడి ప్రచారం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు సోమవారం 19వ వార్డు పరిధి వసువానిపాలెం, జాలారి ఎండాడలో ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరిగి టిడిపి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు, బిజెపి నాయకులు పాల్గొన్నారు

జివిఎంసి 10వ వార్డు పరిధి ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో వెలగపూడి సతీమణి సుజన ప్రచారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి వెలగపూడిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సూపర్ సిక్స్ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో పద్మజ, సీత, మాధురి, శ్రీలక్ష్మి, సబిత, సరోజ, రాధిక, సుమా, పీతల అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

'గంగవరం' సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సంవత్సర కాలంగా మెరుగైన వేతనం, హక్కుల కోసం పోరాడుతున్న గంగవరం పోర్టు సర్వీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (జిపిఎస్) ఉద్యోగులకు కనీస వేతన చట్టప్రకారం నెలకు రూ.36వేలు ఇవ్వాలని, వారందరినీ అదానీ పోర్టు ఉద్యోగులుగానే పరిగణించి ఉద్యోగ భద్రత కల్పించాలని మానవ హక్కుల వేదిక (హెచ్ఆర్ఎఫ్) జిల్లా అధ్యక్షుడు పి.రఘు, ప్రధాన కార్యదర్శి కె.అనూరాధ డిమాండ్ చేశారు. గంగవరం, దిబ్బపాలెం నిర్వాసిత ఉద్యోగుల న్యాయమైన పోరాటానికి తమ సంస్థ మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

ఇక సమరమే..!

అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 63 నామినేషన్లలో 9 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో 54 మంది పోటీలో మిగిలారు. అనకాపల్లి నుంచి అధికంగా 12 మంది, చోడవరంలో తక్కువగా ఆరుగురు పోటీలో ఉన్నారు. అనకాపల్లి, నర్సీపట్నం నియోజకవర్గాల నుంచి ఏ ఒక్కరూ పోటీ నుంచి వెనక్కుతగ్గలేదు. ఉపసంహరణ తరువాత మాడుగుల, పాయకరావుపేటలో 9 మంది చొప్పున, యలమంచిలిలో 10 మంది, చోడవరంలో ఆరుగురు, అనకాపల్లిలో 12 మంది, నర్సీపట్నంలో 8 మంది పోటీలో మిగిలారు.

విశాఖ పార్లమెంటు స్థానానికి పోటీలో 33 మంది

విశాఖ కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా విశాఖ పార్లమెంటు స్థానానికి దాఖలైన మొత్తం 39 నామినేషన్లలో స్క్రూటినీ తర్వాత 33 నామినేషన్లకు జిల్లా రిటర్నింగ్ అధికారి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆమోదం తెలిపారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణకు ఇచ్చిన గడువులోగా ఏ ఒక్కరూ ఉపసంహరించుకోనందున పోటీలో 33 మంది అభ్యర్థులు మిగిలారు. ఇండియా కూటమి తరపున కాంగ్రెస్ అభ్యర్థి పి.సత్యారెడ్డి, వైసిపి తరపున బొత్స ఝాన్సీ లక్ష్మి, టిడిపి జనసేన, బిజెపి కూటమి తరపున టిడిపి అభ్యర్థి ఎం.శ్రీభరత్ పోటీలో ప్రధానంగా ఉన్నారు. వీరితోపాటు సమాజ్ వాది పార్టీ తరపున జాలాది విజయ కుమారి, తదితరులు పోటీలో ఉన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు సాయంత్రం, అక్షర క్రమంలో గుర్తులను రిటర్నింగ్ అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున కేటాయించారు.

'దక్షిణం'లో 17 మంది పోటీ

విశాఖ కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం నుంచి నామినేషన్లు ఉపసంహరణ గడువు అనంతరం 17 మంది పోటీలో మిగిలారు. నామినేషన్ల పరిశీలన అనంతరం 19 మంది నామినేషన్లను రిటర్నింగ్ అధికారి ఆమోదించారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ సందర్భంగా రోహిత్ కుమార్ జైన్, మొయి స్వామి నాయుడు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో పోటీలో 17 మంది మిగిలారు. వీరిలో ఇండియా కూటమి తరపున కాంగ్రెస్ అభ్యర్థి వాసుపల్లి సంతోష్‌కుమార్, వైసిపి అభ్యర్థిగా వాసుపల్లి గణేష్ కుమార్, టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థిగా సిహెచ్ వంశీకృష్ణశ్రీనివాస్ ప్రధానంగా పోటీలో ఉన్నారు.

భీమిలి బరిలో 15 మంది

భీమునిపట్నం : నామినేషన్ల ఉపసంహరణ అనంతరం భీమిలి అసెంబ్లీ స్థానంలో 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ ఎస్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ప్రజా ప్రస్థానం అభ్యర్థి దాసరి లక్ష్మీ సంధ్య, ఇండిపెండెంట్ అభ్యర్థి ఏలూరు ధర్మవతి నామినేషన్లను ఉపసంహరించుకున్నారు దీంతో భీమిలిలో కూటమి తరపున టిడిపి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు, వైసిపి అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఇండియా ఫోరం బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి అడ్డాల వెంకటవర్మ రాజుతోపాటు చోడిపల్లి రాజు(ఎన్‌పి), భాగం గోపాలరావు (బిఎస్‌పి), కోలా హరిబాబు (రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా), ఇల్లిపిల్లి అనిల్‌కుమార్ (జై భారత్ నేషనల్ పార్టీ), గంటా శ్రీనివాసరావు (జాతీయ జనసేన పార్టీ), ఇండిపెండెంట్లుగా మేకా సత్య కిరణ్, చొప్పల్లి శరవన్ గణేష్, బావిశెట్టి రమణబాబు, బుగత రాము, నాగోతు నాగమణి, నందికోళ్ల సంధ్య పోటీలో ఉన్నారు.

పెందుర్తిలో 14 మంది

పెందుర్తి : పెందుర్తి అసెంబ్లీ స్థానంలో 14మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 19 మంది నామినేషన్లు వేయగా,ఐదురుగు ఉపసంహరించుకున్నారు వైసిపి అభ్యర్థిగా అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కూటమి తరపున జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు, ఇండియా ఫోరం బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి పిరిడి భగత్‌తోపాటు ఇతర అభ్యర్థులున్నారు.

ఉత్తరంలో 15మంది పోటీ

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు ఆర్‌ఓ డి.అఖిల తెలిపారు. 17నామినేషన్లలో ఇద్దరు ఉపసంహరించుకోగా, వైసిపి తరపున కెకె.రాజు, కూటమి బలపరిచిన బిజెపి అభ్యర్థి పెనుమత్స విష్ణుకుమార్‌రాజు, ఇండియా ఫోరం తరపున కాంగ్రెస్ అభ్యర్థి లకరాజు రామారావు, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా వెంకటలక్ష్మినారాయణ, ఇంకా పెద్దాడ కనకమహాలక్ష్మి (బిఎస్‌పి), గుంపల శరత్‌బాబు (ఎస్‌పి), జాతీయ జనసేన పార్టీ అభ్యర్థి జగదీష్‌పి., నవభారత్ నిర్మాణ్ సేవ పార్టీ అభ్యర్థి చింతాడ సూర్యం, ఇండిపెండెంట్లుగా కోనేటి ఈశ్వర వీరభద్రాచారి, చప్పా రామునాయుడు, బొడ్డు వరహా సత్య శ్రీనివాస్, బొర్రా రమేష్, రోణంకి చలపతిరావు, వడ్డి శిరీష పోటీలో ఉన్నారు.

గాజువాకలో 14మంది పోటీ

గాజువాక : నామినేషన్ల ఉపసంహరణ తర్వాత గాజువాక అసెంబ్లీ స్థానంలో 14మంది అభ్యర్థులు పోటీలో మిగిలారు. ఇండియా ఫోరం బలపరిచిన సిపిఎం అభ్యర్థి ఎం జగ్గు నాయుడు, వైసిపి నుంచి గుడివాడ అమర్నాథ్, కూటమి బలపరిచిన టిడిపి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు, ప్రజాశాంతి పార్టీ తరపున కెఎ.పాల్, లోక తాంత్రిక పార్టీ టి అక్కయ్య, జై మహాభారత్ పార్టీ నుంచి కె.ఆదినారాయణ, ప్రజా ప్రస్థానం నుంచి టి.శైలజ, నవభారత్ సేవా పార్టీ నుండి బత్తుల నీలకంఠం, దళిత బహుజన పార్టీ నుంచి సామిల్లాన్ ధర్మరాజు, నవశకం నుంచి సుంకర జ్యోతి ఇండిపెండెంట్లుగా కాకర్లమూడి కృష్ణ ప్రదీప్, కొవ్వూరు కృష్ణ, ఎస్ శ్రీనివాసరావు పోటీలో నిలబడ్డారు.

తూర్పు బరిలో 14 మంది

ఎంవిపి కాలనీ : నామినేషన్ల ఉపసంహరణ అనంతరం తూర్పు నియోజకవరగంలో 14 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వైసిపి నుంచి ఎంవివి.సత్యనారాయణ, తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి నుంచి వెలగపూడి రామకృష్ణబాబు, కాంగ్రెస్ నుంచి గుత్తుల శ్రీనివాసరావు ప్రధానంగా పోటీలో ఉన్నారు.

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి -భీమునిపట్నం : కూటమి బలపరిచిన భీమిలి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం శ్రీభరత్ విజయాన్ని కాంక్షిస్తూ టిడిపి మూడో వార్డు కమిటీ ఆధ్వర్యంలో అప్పికొండవీధి, కొంకివీధి, కొండ పేట ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.గంటా తనయుడు రవితేజ,కార్పొరేటర్లు గాడు చిన్నికుమారి లక్ష్మి, గంటా అప్పలకొండ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, గొలగాని నరేంద్ర కుమార్, పి లక్ష్మీ కుమారి, కొక్కిరి అప్పన్న, వియ్యపు పోతురాజు పాల్గొని, సూపర్ సిక్స్ పథకాల బ్రోచర్లను ఇంటింటికి వెళ్లి అందజేశారు

12వ వార్డులో టిడిపి ప్రచారం

ఆరిలోవ: కూటమి బలపరిచిన టిడిపి తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు, విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్‌ను గెలిపించాలని కోరుతూ 12వ వార్డు టిడిపి నాయకులు సోమవారం. ఆరిలోవ న్యూశాంతినగర్ కొండ, బిసి కాలనీ, గణబాబు నగర్, బిటిఆర్‌నగర్, తోటగరువు పరిశర ప్రాంతాల్లో ప్రచారం చేశారు. వార్డు ఇన్‌చార్జ్ ఒమ్మి అప్పలరాజు, అధ్యక్షులు గాడి సత్యం, ఏడువాక సన్యాసిరావు, ఒమ్మి పోలారావు, నమ్మి గణేష్ పాల్గొన్నారు.

గణబాబుకు పలువురి మద్దతు

గోపాలపట్నం : కూటమి బలపరిచిన పశ్చిమ టిడిపి అభ్యర్థి పి.గణబాబు అన్నారు. సోమవారం జివిఎంసి 56వ వార్డుకు చెందిన టిడిపి ఎస్‌సి సెల్ అధ్యక్షుడు నాగయ్య ఆధ్వర్యంలో దయానంద నగర్, చాకలిగడ్డ ప్రాంతానికి చెందిన పలువురు ఎమ్మెల్యే గణబాబుకు మద్దతు తెలిపారు స్థానిక కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, శివ శంకరరావు సిహెచ్.కుమార్, పొట్నూరు శ్రీనివాస్, పార్వతి, సరస్వతి, వెంకటలక్ష్మి, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

1 నుంచి డ్యాన్స్ వేసవి శిక్షణ శిబిరం

ప్రజావక్తి - ఆరిలోవ : స్నేహాంజలి సంగీత నృత్యాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు మే ఒకటోతేదీ నుంచి 1 వరకు ఆదర్శనగర్ స్నేహాంజలి నృత్యాలయంలో డ్యాన్స్ వేసవి శిక్షఫ శిబిరాన్ని నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సోమవారం దీనికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ అవకాశాన్ని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఔత్సాహికులు ఫోన్ 9949319039, 9640145463 నెంబర్లను సంప్రదించవచ్చున్నారు.

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని గంధవరం గ్రామానికి చెందిన ఇర్ర మంగ అనే వివాహిత ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి తాండ్రంగి పెంటయ్య ఫిర్యాదు మేరకు పద్మనాభం పోలీసులు తెలిపిన వివరాలివి.

విజయనగరం జిల్లా గంట్యాడ మండలం కొత్త వెలగాడ గ్రామానికి చెందిన తాండ్రంగి పెంటయ్య కుమార్తె, మృతురాలు ఇర్ర మంగను గంధవరం గ్రామానికి చెందిన నాగరాజుతో 20ఏళ్ల క్రితం వివాహమైంది. వీరు ఉపాధికోసం విజయవాడ వెళ్లి అక్కడ నివాసము ంటున్నారు. వీరికి ఇద్దరు మగపిల్లలు. వారు చనిపోవడం తో మానసికంగా కుంగిపోయిన మంగ విజయవాడలో చికిత్స పొందుతోంది. ఈనెల 26న గంధవరంలో పండుగకు వచ్చిన మంగ, ఆదివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి అత్త ఇర్ర సత్యవతి తలుపు కొట్టగా, ఎంతకీ తీయకపోయేసరికి చుట్టుపక్కల వాళ్ళను పిలిచి తలుపు పగలగొట్టగా ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జె.రమేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి -మధురవాడ : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన పిఎం.పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. సిఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. జివిఎంసి ఏడోవార్డు చంద్రంపాలేనికి చెందిన పోతిన సత్యనారాయణ (చిన్నబాబు) సోమవారం ఉడా రోడ్డు నుంచి మిధిలాపురి ఉడా కాలనీ వైపు బైక్‌పై వెళ్తుండగా, మలుపు తిరుగుతున్న కారును వెనుకనుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కింద పడ్డ చిన్నబాబుపై వెనుకనుంచి వచ్చిన మరోబైక్ అతనిపైనుంచి వెళ్లడంతో తీవ్రగాయపడ్డాడు. క్షతగాత్రుడిని కెజిహెచ్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందాడన్నారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

ఎన్నికల ప్రచారంలో కుటుంబ సభ్యులు



ఎన్నికల ప్రచారంలో వర్మరాజు సతీమణి స్వప్న

ప్రజాశక్తి-భీమునిపట్నం : జివిఎంసి 3,4 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో ఇండియా ఫోరం బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి అడ్డాల వెంకటవర్మరాజును గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి అడ్డాల స్వప్న, ఇతర మహిళా కాంగ్రెస్ నేతలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేసే ఇందిరమ్మ అభయహస్తం పథక ప్రయోజనాలను వివరించారు.

కూటమి అభ్యర్థుల కుటుంబసభ్యుల ప్రచారం

ప్రజాశక్తి-పెందుర్తి : కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ మండలంలోని రాంపురం, పినగాడి గ్రామాల్లోని జామివాని చెరువు, రెడ్డి చెరువులో ఉపాధి పని ప్రదేశంలో కుటుంబసభ్యులు విస్తృతంగా ప్రచారం చేశారు. పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు సతీమణి మహాలక్ష్మి, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్ సోదరి మాధవి ప్రచారం చేశారు. ఎమ్మెల్యేగా పంచకర్లను గాజుగ్లాస్ గుర్తుపైనా, ఎంపీగా రమేష్‌ను కమలం గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు.జెడ్‌పి మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, మాజీ ఎంపిపి రెడ్డి వరలక్ష్మి, జనసేన మండల అధ్యక్షులు కె.రామునాయుడు, వెన్నల సన్యాసినాయుడు, కుచ్చు కన్నయ్య, సబ్బవరపు రామ్‌కుమార్, పెంటబాబు , బి.హరగాపాల్ ఏ.బంగారునాయుడు ,బంగారయ్య , చలపతి ,శ్రీను పాల్గొన్నారు

నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి :లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి- సీతమ్మధార: ప్రజలు తనకు, తన పార్టీకి ఒక్క అవకాశమిస్తే నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని జై భారత్ నేషనల్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీనారాయణ హామీ ఇచ్చారు. సోమవారం మురళీనగర్ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి జై భారత్ మేనిఫెస్టోను వివరించారు. గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలను అరికడతానని, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.టార్చిలైట్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు..

గంటా ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-పద్మనాభం : ఊరూరా పోటాపోటీ శిబిరాలు, టిడిపిలోకి భారీ చేరికలతో మండలంలోని గంధవరం, కొవ్వాడ, పి.కొవ్వాడ, పెంట, అనంతవరం, బిహెచ్.పురం, వికె.పాలెం ఏడు గ్రామాల్లో భీమిలి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గంధవరంలో గన్నవరం ఎంపిటిసి రమణరాజు, మరో 20 మంది కార్యకర్తలు గంటా ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. కె కొవ్వాడలో మాజీ ఎంపిపి గోపి బాబు ఆధ్వర్యంలో 150 మంది, కోన శ్రీను ఆధ్వర్యంలో వందమంది వైసిపిని వీడి తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. అనంతవరంలో ఇటీవలే వైసిపి నుంచి గంటా సమక్షంలో టిడిపిలో చేరిన జి.లక్ష్మి భర్త జి.పెద్దఎర్రినాయుడు ఆధ్వర్యంలో పలువురు నేతలు గంటాకు ఘనస్వాగతం పలికారు. జనసేన మండల పార్టీ అధ్యక్షుడు కె.రామసోమినాయుడు,టిడిపి నేతలు కె. రమణ, కె.లీలావతి, కె.దామోదరరావు, నగేష్‌కుమార్, నందీశ్వరరావుపాల్గొన్నారు

గంటా సమక్షంలో టిడిపిలో మజ్జి రమేష్ చేరిక

ఆనందపురం : తర్లువాడ పంచాయతీ వైసిపి నేత మజ్జి రమేష్‌నాయుడు తన అనుచరులతో వైసీపీకి రాజీనామా చేసి భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు సమక్షంలో టిడిపిలో చేరారు. మాజీ ఉపసర్పంచ్‌లు బాలి వెంకట్రాజు, కోరాడ అప్పలనాయుడు, బాలి ఏడుకొండల అప్పలనాయుడు, కోరాడ రాంబాబు, హైస్కూల్ చైర్మన్ బాలి రమణమ్మ, బాలి సూర్యనారాయణతోపాటు 250 మంది టిడిపిలో చేరారు.

వైసిపి ప్రచారాలు

ప్రజాశక్తి- వేపగుంట : 52వ వార్డు శాంతీనగర్ ప్రాంతంలో వైసిపి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రచారం చేశారు. పశ్చిమ ఎమ్మెల్యేగా ఆడారి ఆనందకుమార్, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రూ.20 లక్షల సొంత నిధులు వెచ్చించిన ఆనందకుమార్, ఎమ్మెల్యేగా గెలిస్తే మరింత అభివృద్ధి చేస్తారన్నారు. మార్కెట్ కమిటి చైర్మన్ బిఎస్.కృష్ణ, జియ్యాని మారుతి, శ్రీదేవివర్మ పాల్గొన్నారు.

గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు నరసింహనగర్, పద్మనాభనగర్, లెప్రసీ కాలనీలలో వైసిపి నేత బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ సతీమణి ఆడారి మాలతితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గునిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు అధ్యక్షులు గొర్లె అప్పల స్వామి నాయుడు పాల్గొన్నారు.

పెన్షనర్లతో వైసిపి అభ్యర్థి సమావేశం

వేపగుంట : జివిఎంసి 94వ వార్డు నాయుడు తోటలో పెన్షనర్లతో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అదీప్‌రాజ్ సోమవారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. మేనిఫెస్టోలోని 99శాతం పథకాలను అమలు చేసిన ఘనత సిఎం జగన్‌దేనన్నారు. వైసిపి అభ్యర్థులుగా పెందుర్తి మ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అజయ్‌రాజ్ రామరాజు, రాంబాబు, ఆదిరెడ్డి, మురళి, తామర్ల నర్సింగరావు పాల్గొన్నారు


సిఐటియు మజ్జిగ చలివేంద్రం



మజ్జిగ చలివేంద్రంలో సిఐటియు నేతలు

ప్రజాశక్తి -గాజువాక : సమస్యలపై పోరాటమే కాదు, సిఐటియు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందని యూనియన్ సీనియర్ నేత ఎన్.రామారావు అన్నారు. పెంటమాంబ గ్రామదేవత పండుగ సందర్భంగా పెదగంట్యాడలో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు జి.శ్రీనివాసరావు, నమ్మి రమణ, సిహెచ్.రాముడు, ఎన్.కృష్ణకుమారి, ఒ.అప్పారావు, శ్రావణ్, ఈశ్వరరావు, జి పెంటారావు పాల్గొన్నారు

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖ, అనకాపల్లి
మంగళవారం
30 ఏప్రిల్ 2024





కలం మాట

ఓటు హక్కు... తరతరాల జన్మహక్కు

బతికుండగానే
మువ్వన్నెల జెండాను భుజానికెత్తుకుని
చద్దిమూట నెత్తిన పెట్టుకుని
నాయకుల ఫొటోలన్నీ నట్టింట్లో పాతరేసి
జెండర్ లేకుండానే
అజెండాలన్నీ వీపునకు చుట్టేసుకుని
చిట్టా పద్దులన్నీ ముందే లెక్కలేసుకుని
గిట్టుబాటు ధరలేదంటూ
కిలో టమోటాకు రూపాయైనా ముట్టదంటూ
పిడికెడన్నం ఉడకలేదంటూ
పట్టెడన్నం పారబోసి
రసాయనాలన్నీ శరీరంలోకి ఎక్కించేసుకుని
సత్తువనంతా నీరుగార్చేసి
లేపనాలు రాస్తూ
ఉచితాలతో ఉపాధి లేకుండా చేస్తే
ఆక్సిజన్ ధరను ఆకాశానికెత్తేస్తూ
పిన్నీసులన్నీ అయిన వాళ్లకే అద్దెకిచ్చేస్తూ
ఆ వీలునామాలో వింతలన్నీ జొప్పిస్తూ
తొంభై తొమ్మిదేళ్ల లీజు నా సొంతమంటూ
నిన్నే పొగుడుకుంటూ
నిన్నే ఓటర్ల లిస్టులో వెతుక్కుంటూ
భవిష్యత్తే లేని గతంతో బేరీజు వేసుకుంటూ
భావితరాలకు ఏం గ్యారెంటీ ఇస్తారో
మన ఊరికి ఏం మేలు చేస్తారో
ఏది ఏమైనా..
మన ఊరు వెయికాంతులీనాలి
ఐక్యంగా మనమంతా మెలగాలి
ఓటు హక్కు తరతరాల జన్మ హక్కని
ఎన్నికల సంగ్రామంలో అందరూ బిక్కుబిక్కు
నాయకుల గుండెల్లో
అది ముడివీడని పెద్దచిక్కు...

-పెంటకోట లక్ష్మీనరసింహం,
కవి, రచయిత, పెందుర్తి,
మొబైల్ :94416 07235

పలు కాలనీల్లో సిపిఎం విస్తృత ప్రచారం


ఎన్నికల ప్రచారంలో సిపిఎం అభ్యర్థి జగ్గు నాయుడు., ఇతర నేతలు

ప్రజాశక్తి -గాజువాక : ఇండియా ఫోరం బలపరిచిన సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు సోమవారం జోగవానిపాలెం, భానోజీతోట, ఉప్పర కాలనీ, రాజీవ్‌నగర్ కాలనీ, బొజ్జన్నకొండ, దశమకొండ, తదితర ప్రాంతాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గు నాయుడు మాట్లాడుతూ, గాజువాక హౌస్ కమిటీ సమస్యపై సిపిఎం వివిధ రూపాల్లో పోరాటం చేసి, జిఒ 7 రద్దయ్యేలా చేసిందన్నారు. కొండవాలు ప్రాంతాల్లో తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు, పేదలకు ఇళ్లపట్టాల సమస్యలపై సిపిఎం పోరాడుతుందన్నారు. విశాఖ డెయిరీ, గంగవరం పోర్టు కాలుష్యంపైనా, చెత్త పన్ను రద్దుపైనా పోరాటం చేస్తామన్నారు. గాజువాకలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటు, గాజువాక ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. స్టీల్‌ప్లాంట్ అమ్మేయాలని చూస్తున్న బిజెపి, దాంతో పొత్తుపెట్టుకుని టిడిపి, జనసేన, పరోక్షంగా అంటకాగిన వైసిపిలను ఓడించాలన్నారు. ఇండియా ఫోరం బలపరిచిన సిపిఎం అభ్యర్థిగా తనను, ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి సత్యారావును గెలిపించాలని కోరారు. ప్రచారంలో సిపిఎం జోన్ కార్యదర్శి ఎం రాంబాబు, ఆర్కే ఎస్ వి కుమార్, డీ లోకేష్, కిరీటం, డి శ్రీను, సంతోషం పాల్గొన్నారు.

ముత్తంశెట్టి ఎన్నికల ప్రచారం


ఎన్నికల ప్రచారర్యాలీలో మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు చేపలుప్పాడ, కాపులుప్పాడ, సోమన్నపాలెం తదితర గ్రామాల్లో వైసిపి భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసిపి మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి, జనసేన కార్యకర్తలు ముత్తంశెట్టి సమక్షంలో వైసిపిలో చేరారు

ఘన చరిత్రకు మసక.!

- మూతపడిన తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ
- కళ తప్పిన బెల్లం మార్కెట్
- ఎపిఇపిడిసిఎల్‌లో ఆర్ఇసిఎస్ విలీనం
- మరమ్మతులకు నోచని శారదానది గ్రోయిన్లు
- ఇంకా రిఫరల్ ఆసుపత్రిగానే ఎన్‌టిఆర్ హాస్పిటల్
- సుగర్ ఫ్యాక్టరీ పీకనులిమేసిన చంద్రబాబు..
- ఆధునికీకరణ మాట నిలబెట్టుకోని జగన్
- ఇదీ అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ చరిత్ర

దేశంలోనే రెండవ అతిపెద్ద మార్కెట్‌గా నాణ్యత కలిగిన బెల్లంగా అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు పేరు ఉండేది. కాని నేడు కళ తప్పి ఈగలు తోలుకొనే పరిస్థితి నెలకొంది. రైతులు తమ భార్యల పుస్తులతాళ్లను అమ్ముకొని సహకార రంగంలో ఏర్పాటు చేసుకున్న అనకాపల్లి వి.వి.రమణ సహకార చక్కెర కర్మాగారాన్ని పాలకులు పీక నిలుమేసేశారు. గ్రామీణ రైతుల కోసం ఎంతో ఉన్నత లక్ష్యంతో నాటి ఎమ్మెల్యే పి.వి.రమణ చొరవ తీసుకొని ఏర్పాటు చేసిన గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (ఆర్ఇసిఎస్)ను ఎపిఇపిడిసిఎల్‌లో విలీనం చేసి ఆ లక్ష్యానికి తూట్లు పొడిచారు. రైతులకు సాగునీరు అందించే శారదానది గ్రోయిన్లకు రెండు దశాబ్దాలుగా మరమ్మతులు చేయడం మార్చిపోయారు. అనకాపల్లి అంటేనే గుర్తుకొచ్చే, ఎంతో ఘనమైన చరిత్ర కలిగిన ఇవన్నీ నేడు మసకబారుతున్నాయి. గతంలో ఇక్కడి నుండి ఎన్నికైన ప్రజాప్రతినిధులు వీటికి వెన్నె తేగా, ఈ 25 ఏళ్లలో ఎన్నికైన వారు వీటి గురించి పట్టించుకోవడం మానేశారు.

ప్రజాశక్తి-అనకాపల్లి

నియోజకవర్గంలో సహకార రంగంలో ఉన్న ఏకైక పరిశ్రమ అనకాపల్లి వివి రమణ సహకార చక్కెర కర్మాగారం. ప్రైవేటు పరిశ్రమగా ఉన్న దీనిని మార్వాడీ వ్యాపారి అమ్మకానికి పెడితే వివి.రమణ చొరవ తీసుకొని రైతుల నుండి డబ్బులు కూడగట్టి దీనిని కొనుగోలు చేసి, రైతులను సభ్యులుగా చేర్చి సహకార రంగానికి మార్చారు. సభ్య రైతులు 13వేల కుటుంబాలతో పాటు సుమారు 700 మంది కార్మికులు ఈ పరిశ్రమపై ఆధారపడి జీవించేవారు. పరోక్షంగా వేలాది మందికి ఈ సహకార చక్కెర పరిశ్రమ ఉపాధి కల్పించేది. 1990 వరకు అత్యంత సమర్ధవంతంగా నడవగా, రాజకీయ జోక్యం పెరగడంతో పరిశ్రమ మనుగడపై నీలి నీడలు అలుముకున్నాయి. నానాటికీ నష్టాల ఊబిలో కూరుకు పోయింది.

కోట్ల విజయభాస్కరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రూ.40 కోట్లతో పరిశ్రమ ఆధునికీకరణ శంకుస్థాపన చేశారు. అయితే తరువాత వచ్చిన ఎన్‌టిఆర్ ప్రభుత్వం మద్య నిషేధంలో భాగంగా ఈ కర్మాగారానికి అనుబంధంగా ఉన్న డిస్టలరీ యూనిట్‌ను మూసివేయడంతో దానిని అనుబంధంగా ఉన్న గ్యాస్, ఫార్మాసూటికల్స్, గ్లూకోజ్ యూనిట్లు మూతపడ్డాయి. అనంతరం వచ్చి చంద్రబాబు ప్రభుత్వం సహకార రంగాన్ని నిర్వీర్యం చేసింది. ఆధునికీకరణ ఊసెత్తకపోగా, కర్మాగారాన్ని మూసివేసింది. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఈ కర్మాగారాన్ని తిరిగి తెరిపించినా ఆధునికీకరణ చేపట్టలేదు. అయితే యంత్రాలు పాతబడిపోవడంతో క్రషింగ్ రికవరీ శాతం పడిపోవడంతో నష్టాల పరంపర కొనసాగింది. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం దీనిని మళ్లీ మూసివేసింది.

అనకాపల్లి నియోజకవర్గం ఓటర్లు


మొత్తం ఓటర్లు : 2,45,955 మంది

పురుషులు : 1,19,146 మంది

మహిళలు 1,26,773 మంది

కర్మాగారం ఆస్తులను అమ్మకానికి పూనుకోగా, రైతులు, కార్మికులు, రైతు, కార్మిక సంఘాలు తీవ్రంగా ప్రతిఘటించడంతో చేసేది లేక 2019 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని టిడిపి ప్రభుత్వం 2018లో మళ్లీ క్రషింగ్ చేపట్టింది.






వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఈ కర్మాగారాన్ని పూర్తిగా ఆధునికీకరణ చేస్తామని, అనుబంధం యూనిట్లు ప్రారంభిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక క్రషింగ్ నిలిపివేశారు. వైసిపి ప్రభుత్వం కూడా కర్మాగారం ఆస్తులను అమ్మకానికి ప్రయత్నం చేసింది. మొత్తంగా తుమ్మకాల సుగర్ ఫ్యాక్టరీ పీకను చంద్రబాబు ప్రభుత్వం నులిమేస్తే, ఆధునికీకరణ చేస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కి జగన్ ఇక్కడి రైతులను మోసం చేశారు.


మూతబడిన తుమ్మపాలలో వివి.రమణ సుగర్ ఫ్యాక్టరీ

వీరే ప్రధాన పోటీదారులు

2024 ఎన్నికల్లో అధికార వైసిపి నుండి మలసాల భరత్‌కుమార్, టిడిపి, బిజెపి, జనసేన కూటమి నుండి జనసేన అభ్యర్థిగా కొణతాల రామకృష్ణ, కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, ఆప్ పార్టీల (ఇండియా వేదిక) నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా ఐఆర్ గంగాధర్ పోటీ చేస్తున్నారు. వీరి ముగ్గురు మధ్య ప్రధాన పోటీ జరగనుంది.


కొణతాల రామకృష్ణ
జనసేన

ఐఆర్.గంగాధర్
కాంగ్రెస్

మలసాల భరత్‌కుమార్, వైసిపి

కళతప్పిన బెల్లం మార్కెట్

దేశంలోనే రెండవ అతిపెద్ద బెల్లం మార్కెట్‌గా అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీకి పేరు ఉంది. అయితే వివిధ రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు బెల్లం దిగుమతి కావడంతో ఇక్కడి బెల్లం రైతులకు నష్టాలు రావడం, ప్రభుత్వం నుంచి చెరకుకు గిట్టుబాటు ధర లేకపోవడం వంటి కారణాలతో ప్రస్తుతం అనకాపల్లి బెల్లం మార్కెట్ పరిస్థితి అయోమయంగా మారింది.

ఆర్ఇసిఎస్ సేవలను దెబ్బతీసిన వైసిపి

చెరుకు ఎక్కువగా పండించే గ్రామీణ ప్రాంత రైతుల కోసం 1972లో ఎమ్మెల్యేగా విజయం సాధించిన పెంటకోట వెంకటరమణ గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (ఆర్ఇసిఎస్)ను స్థాపించారు. నాటి నుండి ఐదు మండలాల రైతులకు, గృహ వినియోగదారులకు ఆర్ఇసిఎస్ తక్కువ ధరకు విద్యుత్ అందిస్తూ వచ్చింది. అయితే వైసిపి ప్రభుత్వం దీనిని ఎపిఇపిడిసిఎల్‌లో విలీనం చేసింది. దీనిపై ఈ ప్రాంత రైతుల నుండి తీవ్ర వ్యతిరేకత రాగా, విలీనం వెనక్కి తీసుకున్నట్లు ప్రకటించి మోసం చేసింది. ఎపిఇపిడిసిఎల్‌లో విలీనమైన తరువాత విద్యుత్ ఛార్జీలు భారీగా పెరిగాయి. విద్యుత్ సమస్యలపై రైతులు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడే ఉండడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులకు నోచని శారదా నది గ్రోయిన్లు

అనకాపల్లి నియోజకవర్గానికి ప్రధాన సాగునీటి వనరుగా ఉన్న శారదా నదిపై ఏర్పాటు చేసిన 11 గ్రోయిన్లు గత రెండు దశాబ్దాల కాలంగా మరమ్మతులకు నోచుకోలేదు. మరమ్మతులకు కావలసిన నిధులు సైతం విడుదల చేయకపోవడంతో పూర్తిగా శిధిల స్థితికి చేరాయి. దీంతో రైతులకు సాగునీరు లేక పంటలు వేయలేకపోతున్నారు. ఉపాధి కోసం దగ్గరలో ఉన్న ఫార్మా వంటి కంపెనీలకు రైతులు తరలిపోతున్నారు. ఎన్టీఆర్ ఆసుపత్రి పేరుకే జిల్లా ఆసుపత్రిగా ఉంది గాని ఇక్కడ వచ్చిన రోగులకు పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదు. వేలాది కేసులను విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలిస్తుండడం, మార్గమధ్యంలో ఎంతోమంది చనిపోతుండడం పరిపాటిగా మారింది. కోర్టుల సముదాయం, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అనకాపల్లి జిల్లాగా ఏర్పడిందే కాని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. ఆర్‌డిఓ కార్యాలయ నిర్మాణం పూర్తయిన వినియోగంలో లేని పరిస్థితి ఉంది. దీంతో కోట్లాది రూపాయలు ప్రజాధనం దుర్వినియోగమవుతుంది. రాజకీయ నాయకులు ఎన్నికల ముందు వాగ్దానాలకే పరిమితమై తరువాత వాటి ఊసే ఎత్తడం లేదు. ఈ నేపథ్యంలో అనకాపల్లి జిల్లాను అభివృద్ధి పరిచే నాయకులను ఎన్నుకోవాల్సి ఉంది.

అనకాపల్లి ఎమ్మెల్యేలు వీరే...

1952	: కోడిగంటి గోవిందరావు (సిపిఐ)
1955	: భీశెట్టి అప్పారావు (కృషికర్ లోకపార్టీ)
1962	: కోడిగంటి గోవిందరావు (సిపిఐ)
1967	: కోడిగంటి గోవిందరావు (సిపిఐ)
1972	: పెంటకోట వెంకటరమణ (కాంగ్రెస్)
1978	: కె.గోవిందరావు (సిపిఐ)
1983	: రాజా కన్నబాబు (టిడిపి)
1985	: దాడి వీరభద్రరావు (టిడిపి)
1989	: దాడి వీరభద్రరావు (టిడిపి)
1994	: దాడి వీరభద్రరావు (టిడిపి)
1999	:దాడి వీరభద్రరావు (టిడిపి)
2004	:కొణతాల రామకృష్ణ (కాంగ్రెస్)
2009	: గంటా శ్రీనివాసరావు (ప్రజారాజ్యం)
2014	: పీలా గోవింద సత్యనారాయణ (టిడిపి)
2019	: గుడివాడ అమర్‌నాథ్ (వైసిపి)

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఇండియా వేదికను గెలిపిద్దాం

స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల నేతల స్పష్టీకరణ


ఇండియా ఫోరం పార్టీలకు మద్దతుగా స్టీల్ అఖిల పక్ష కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకు ఇండియా కూటమిని గెలిపించాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్ కోరారు.సోమవారం ఉక్కునగరం స్టీల్ సిఐటియు కార్యాలయంలో స్టీల్ వర్కర్ ప్రత్యేక సంచికను ఇండియా ఫోరం, స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ రక్షణ అంశాన్ని అన్ని రాజకీయపార్టీలు తమ మేనిఫెస్టోలో స్పష్టం చేయాలని ఉద్యమిస్తున్నామన్నారు. అయితే దీనిపై ప్రధాన పార్టీల నుంచి స్పందన లేమి, ఉక్కు పరిరక్షణపై వారి చిత్తశుద్ధి, విశ్వసనీయతను స్పష్టం అయితే సిపిఎం, సిపిఐ, ఆమ్ ఆద్మీ, కాంగ్రెస్, తదితర పార్టీలతో కూడిన ఇండియా ఫోరం తమ మేనిఫెస్టో ద్వారా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిస్తామని స్పష్టం చేసినందున వచ్చే ఎన్నికల్లో వేదిక అభ్యర్థులకు మద్దతు పలుకుతూ స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు ఈ పోరాటాన్ని ఉధతం చేయడం సిద్ధం కావాలని అభ్యర్థించారు.

గాజువాక సిపిఎం అభ్యర్థి ఎం జగ్గునాయుడు మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ ఉద్యమానికి ఆదినుంచి అండగా ఉంటున్న సిపిఎంకు ఉక్కు కార్మికుల ఓట్లు అడిగే నైతిక హక్కు ఉందన్నారు.ఉక్కు కార్మికుల గళాన్ని రాష్ట్ర అసెంబ్లీలో వినిపించడానికి సిద్ధంగా ఉన్నానని, తనను ఆశీర్వదించాలని అభ్యర్థించారు. విశాఖ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి పి సత్యారెడ్డి మాట్లాడుతూ ఉక్కు ఉద్యమాన్ని ప్రజలకు మరింత చేరువు చేసేందుకు 'ఉక్కు సత్యాగ్రహం' చిత్రాన్ని నిర్మించి ఈ పోరాటానికి తన వంతు సహకారాన్ని అందించానన్నారు. కేంద్రంలోని బిజెపికి వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ అంశంపై పార్లమెంట్‌లో తన వాణిని వినిపించేందుకు తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

స్టీల్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి డి ఆదినారాయణ మాట్లాడుతూ కార్పొరేట్లకు రెడ్‌కార్పెట్ వేసి పాలన సాగిస్తున్న బిజెపిని చిత్తుగా ఓడించాలని, గాజువాక ఎమ్మెల్యేగా కార్మికవర్గం నేత సిపిఎం అభ్యర్థి జగ్గునాయుడును, విశాఖ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి సత్యారావులకు మద్దతు నిలవాలని కోరారు.స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అష్టదిగ్బంధనంలో పెట్టి, కార్పొరేట్లకు నజరానా ఇవ్వాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చూస్తోందని, దీనికి వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడాలని పిలుపునిచ్చారు.విద్యుత్‌ను అమ్మేస్థాయి నుంచి నేడు కొనుక్కోవాల్సిన దుస్థితికి నెట్టిన బిజెపి, దానికి అంటకాగిన పార్టీలకు బుద్ధి చెప్పాలని, కార్మిక వర్గం ప్రజలు విజ్ఞతతో ఆలోచించి తమ ఓటు హక్కుతో ప్రతిఘటించాలని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో అనకాపల్లి కాంగ్రెస్ అభ్యర్థి వేగి వెంకటేష్, పెందుర్తి కాంగ్రెస్ అభ్యర్థి భగత్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు రామకష్ణ, స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు వైటి దాస్, ఎన్ రామారావు, పి శ్రీనివాసరాజు, తాండ్ర కనకరాజు, రాజబాబు, వర్మ, జె ముత్యాలు, సిహెచ్ సన్యాసిరావు, కర్రి ప్రకాష్, రామ్ కుమార్, పరంధామయ్య, శ్రీనివాస్ స్టీల్ సిఐటియు నాయకులు బి అప్పారావు,వి ప్రసాద్, పుల్లారావు, మరిడయ్య, నీలకంఠం, గంగాధర్, నర్సింగరావు, సూర్యనారాయణ, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

హాకర్స్ జోన్ ఏర్పాటుకు కృషి


వైసిపిలో చేరిన వారితో బొత్స ఝాన్సీ, కెకె.రాజు

సీతమ్మధార : చిరువ్యాపారులకు స్థిర వ్యాపారం కోసం హాకర్స్ జోన్ ఏర్పాటుకు కృషిచేస్తానని వైసిపి ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు అన్నారు. తాటిచెట్లపాలెం 80 అడుగుల రోడ్డు వాటర్ ట్యాంకు వద్ద పరిసర ప్రాంతాల పండ్ల వర్తకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, సీతమ్మధార రైతు బజార్ ఈనాడు గోడను అనుకొని ఇటు సత్యం జంక్షన్ వరకు అటు అల్లూరి విగ్రహం వరకు హకర్స్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైసిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలికలు చొక్కాకుల వెంకటరావు కార్పొరేటర్లు కంపా హనోక్, శశికళ, పైడి రమణ, ఆళ్ల శివ గణేష్, శంకర్, లక్ష్మణ్, వెంకటేష్, తిరుపతిరావు,ఠాగూర్ పాల్గొన్నారు.

45వ వార్డులో ఎన్నికల ప్రచారం

45వ వార్డు కార్పొరేటర్ కంపా హనోక్ ఆధ్వర్యంలో నరసింహనగర్ ప్రాంతంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ఎన్నికల ప్రచారానికి ప్రజలు హారతులిచ్చి, బ్రహ్మరథం పట్టారు.జివిఎంసి 26వ వార్డులో శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో 200మంది వైసిపిలో చేరారు. వీరికి ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. 26వ వార్డు రామకృష్ణనగర్ షిరిడిసాయి జ్ఞానమందిరం 15వ వార్షికోత్సవం సందర్భంగా అన్నసమారాధనలో కెకె.రాజు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని ఆదిరెడ్డి పాలెం గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్టు ఆధ్వర్యంలో హత్తుకొనే చేతులు కార్యక్రమంలో భాగంగా 30 మంది నిరుపేదలైన వికలాంగులకు, వితంతులకు, అనాధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. డి.జాన్ సమర్పణ రాజు వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ట్రస్టు చైర్మన్ పువ్వల విజయ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సిస్టర్ పీస్ ఏంజెల్, పి.సూరిబాబు, ఎస్.నాయుడు, దీవ్యతేజ, రమ్య, స్మైలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మండల పరిషత్తు సమావేశం

ప్రజాశక్తి -పరవాడ : మండల సర్వసభ్య సమావేశం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సార్వత్రిక ఎన్నికల కోడ్ కారణంగా ఎటువంటి తీర్మానాలు చెయ్యలేదు. ఈ సమావేశంలో వ్యవసాయం , విద్య, ఆరోగ్య, నీటిపారుదల, గృహ నిర్మాణ తదితర శాఖలపై సమీక్ష చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, ఎంపిడిఒకీర్తి స్పందన, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సరుగుడు తోట దగ్ధం

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని అమృతపురం గ్రామంలో వెన్నెల వారి కల్లాల వద్ద తుప్పల రేవిడి సరుగుడు తోటలో సోమవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఇది గమనించిన జనసేన నాయకుడు వెన్నెల నరేష్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఆటోనగర్ నుండి అగ్నిమాపక శకటంతో వచ్చి సరుగుడు తోటలో మంటలను అదుపు చేశారు. అగ్నిమాపక సిబ్బంది సరుగుడు తోట భారీ అగ్ని ప్రమాదానికి గురికాకుండా రక్షించారు. ఈ కార్యక్రమంలో పైడం నాయుడు వెన్నల శ్రీను, తైనాన శ్రీరంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో డిజె సౌండ్స్ నిషేధంపై హర్షం

ప్రజాశక్తి -అనకాపల్లి : ఎన్నికల ప్రచారాల్లో వివిధ రాజకీయ పార్టీలు ఉపయోగిస్తున్న డిజె సౌండ్ సిస్టంను నిషేధించడంపై ఎన్నికల అధికారి రవి పఠాన్ శెట్టికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పిఎస్ అజయ్ కుమార్ సోమవార ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనకాపల్లి నియోజకవర్గ ప్రజలు నేటి నుంచి ఊపిరి పీల్చుకున్నాని తెలిపారు. ఎన్నిక ప్రధాన అధికారికి విశ్రాంతి ఐఎఎస్ అధికారి ఈఎఎస్ శర్మ రాసిన లేఖ. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం ప్రతినిధులు ఈ అంశాన్ని లేవదీసి దానిని మినిట్స్‌లో రికార్డు చేయడంతో మొత్తానికి జిల్లా అధికార యంత్రాంగం కదిలిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలకు పోటిపడుతున్న పార్టీలు డీజే సౌండ్ సిస్టమ్స్ వాడకాన్ని స్వచందంగా మానుకోవాలని విజ్ఞప్తి చేశారు

చోడవరం సుగర్స్‌ను లూటీ చేసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి-చోడవరం

టిడిపి ప్రభుత్వ పాలనలో చోడవరం చక్కెర కర్మాగారాన్ని లూటీ చేశారని చోడవరం వైసిపి అభ్యర్థి కరణం ధర్మశ్రీ ఆరోపించారు. సోమవారం స్థానిక కొత్తూరు జంక్షన్లో జరిగిన జగన్మోహన్ రెడ్డి బహిరంగ సభలో ధర్మశ్రీ మాట్లాడుతూ టిడిపి అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు, సుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ గూనూరు మల్లు నాయుడు కర్మాగారంలో రూ.150 కోట్లు అవినీతికి పాల్పడ్డారన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఫ్యాక్టరీకి ఉన్న అప్పును రూ.70 కోట్లుకు తగ్గించమన్నారు. సుమారు రూ.80 కోట్లు ప్రభుత్వం నుండి నిధులను రప్పించి ఫ్యాక్టరీని కాపాడేమన్నారు. అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు మాట్లాడుతూ నాన్ లోకల్ వ్యక్తి అయిన సీఎం రమేష్ కేవలం ఈ ప్రాంతంలో వనరులను దోచుకోవడానికే ఎంపీగా పోటీ చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఏడవక సత్య రావు, ఎంపీపీ గాడి కాసు, జడ్పిటిసి మారిశెట్టి విజయ శ్రీకాంత్, బుచ్చయ్యపేట జడ్పిటిసి దొండ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అధిక సంఖ్యలో జన హాజరు

సీఎం జగన్మోహన్ రెడ్డి సభకు నియోజకవర్గ నాలుగు మండలాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కావలసి ఉన్న ముఖ్యమంత్రి గంట ఆలస్యంగా చోడవరం వచ్చారు. మండుతున్న ఎండలో ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రజలు విన్నారు. కొతత్తూరు జంక్షన్ మెయిన్ రోడ్‌లో బస్సుపై ముఖ్యమంత్రి ప్రసంగించడంతో స్థానిక చీడికాడ రోడ్డు నుండి ట్రాఫిక్‌ను మళ్ళించారు.

సిపిఎస్ రద్దు, మద్య నిషేధం ఏమయ్యాయి?

ప్రజాశక్తి -కశింకోట

గత ఎన్నికల్లో వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన సిపిఎస్ రద్దు, మద్యపాన నిషేధం హామీలు ఏమయ్యాయని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, బిజెపి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ప్రశ్నించారు. మండలంలోని తాళ్ళపాలెం మండల మహిళా గర్జన సమావేశం ఆదివారం రాత్రి జరిగింది. ఇందులో పాల్గొన్న వారు మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, కూటమి నాయకులు దాడి రత్నాకర్, మాధవ్, ద్వరపురెడ్డి పరమేశ్వరరావు, రాయపాటి అరుణ, మండల నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లి : గవరపాలెం 81వ డివిజన్ పాత 20వ వార్డులో పీలా సోమేశ్ నాయుడు గారి వీధి నుండి జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ, సీఎం రిత్విక్ ఇంటింటి ప్రచారం చేశారు. ఎన్టీఆర్ కాలనీలో టిడిపి 23వ వార్డు అధ్యక్షులు బొడ్డేడ మురళి, కార్యదర్శి బుద్ధ ఈశ్వరరావు, జనసేన నాయకులు సూరిశెట్టి రాముడు, కొణతాల రాముడు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు.

పార్టీ శ్రేయస్సు కోసం బండారు గెలుపునకు కృషి

దేవరాపల్లి : పార్టీ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని మాడుగులలో టిడిపి అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి గెలుపు కోసం కట్టుబడి పని చేద్దామని నియోజకవర్గం టిడిపి నాయకులు పైలా ప్రసాదరావు అన్నారు. దేవరాపల్లిలో సోమవారం ఆయన క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని నాలుగు మండలాల కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం పైలా ప్రసాదరావు సమక్షంలో కె.కోటపాడు మండలానికి చెందిన వైసీపీ నాయకులు కొట్టాన సూరిదేముడు, జామి బుచ్చిరాజు, సింగంపల్లి గణేష్, జూరెడ్డి అప్పలనాయుడు, రామిరెడ్డి త్రినాధనాయుడు తదితరులు టిడిపిలో చేరారు. వారికి టిడిపి అభ్యర్థి బండారు పార్టీ కండువాలు వేశారు. కార్యక్రమంలో రాయపు రెడ్డి కృష్ణ, రొంగలి మహేష్, బొడ్డు అక్కు నాయుడు, పోతల రమణమ్మ పాల్గొన్నారు.



ఉపాధి హామీ కూలీలతోమాట్లాడుతున్న సుందరపు శైలజ

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడలో సర్పంచ్ దాడి ఎరుకునాయుడు ఆధ్వర్యంలో మాడుగుల టిడిపి అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి ప్రచారం చేశారు. ఉపాధి హామీ కూలీలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

సుందరపు సతీమణి ప్రచారం

మునగపాక : ఎలమంచిలి నియోజకవర్గ జనసేన పార్టీ అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ సతీమణి సుందరపు శైలజ మండలంలోని చూచుకొండ గణపర్తి గ్రామాల్లో సోమవారం ఉపాధి హామీ కూలీలతో సమావేశమై ప్రచారం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఆడారి మంజు, టెక్కలి పరశురాం, కాళ్ళ చంద్రమోహన్, కాండ్రేగుల నాయుడు, కాండ్రేగుల రామ నాగేశ్వరరావు, కాండ్రేగుల శంకర్, ఎల్లపు శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారిస్తానని ఎలమంచిలి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ మత్స్యకారులకు హామీ ఇచ్చారు. పూడిమడకలోని టిడిపి మత్స్యకార నాయకుడు మెరుగు బాపు నాయుడు ఇంటి వద్ద సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పొన్నమల్ల కొండబాబు, మెరుగు వెంకటరావు ధోని కాసబాబు, మెరుగు అచ్చయ్య, ఎరిపల్లి కోదండరావు పాల్గొన్నారు.

జగన్ పాలనలో కుంటుపడిన అభివృద్ధి

వడ్డాది : రాష్ట్రంలో జగన్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని వంగవీటి రంగా రాధా మిత్రమండలి అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ అన్నారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కోమళ్లపూడిలో యువ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు, పివిఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

జనసేన అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

పరవాడ : మండలంలోని ఈదులపాక బోనంగి గ్రామంలో సోమవారం జనసేన అభ్యర్థిని గెలిపించాలని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు బుగిడి రామగోవిందరావు, అట్టా సన్యాసి అప్పారావు చందక గోవిందరాజు, దామురోతి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిన కొణతాల అనుచరులు



వైవి సుబ్బారెడ్డి సమక్షంలో వైసీపీలో చేరిన కొణతాల అనుచరులు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జనసేన పార్టీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ అనుచరులు బుద్ధ శ్రీనివాసరావు, ఎండి జిలానీ, గోలి వెంకటరావు సోమవారం రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి, అనకాపల్లి వైసిపి అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్ కుమార్ సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమిలో కార్యకర్తలకు నాయకులకు విలువలేదని, విలువలేని చోట గౌరవం ఉండదని తెలుసుకొని జనసేన పార్టీని విడిచి వైసిపిలో చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో మలసాల కిషోర్, పలకా రవి, కలగా గున్నయ్య నాయుడు, బీశెట్టి జగన్ పాల్గొన్నారు.

సంతలో భరత్ కుమార్ ప్రచారం

కశింకోట : కశింకోట మండలం తాళ్ళపాలెం సంతలో అనకాపల్లి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ సోమవారం ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్యనాయుడు, గొల్లివిల్లి శ్రీనువాసరావు, జడ్పీటీసీ దంతులూరి శ్రీధర్ రాజు, వల్లబ నారాయణ రావు, లగిశెట్టి గణేష్ పాల్గొన్నారు.

వైసిపి అభ్యర్థి రాజు ప్రచారం

అచ్యుతాపురం : యలమంచిలి వైసిపి అభ్యర్థి యువి.రమణమూర్తిరాజు సోమవారం మండలంలోని ఎం.జగన్నాధపురం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన భీముని బాబ్జి టిడిపి నుండి వైసీపీలో చేరారు. దోసూరు గ్రామానికి చెందిన గండి రామునాయుడును పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ భీముని వెంకటేశ్వరరావు, భీముని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మునగపాక : జిల్లా డిసిసిబి మాజీ చైర్మన్ యు సుకుమార్ వర్మ సోమవారం మండలంలోని నారాయుడుపాలెం గ్రామంలో వైసిపి నాయకులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి , జడ్పిటిసి పెంటకోట సోమ సత్యనారాయణ, నాయకులు ఆడారి గణపతి అచ్చియ్య నాయుడు, పొలిమేర పూర్ణచంద్ర గణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అదీప్‌రాజ్ ప్రచారం

సబ్బవరం : పెందుర్తి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్ రాజ్ సోమవారం మండలంలోని గుల్లేపల్లి, బోదువలస, ఎల్లుప్పి, మర్రిపాలెం, అయ్యన్న పాలెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పెందుర్తి ఎమ్మెల్యేగా తనను ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు, వైసిపి నాయకులు కర్రి బాబు, బండారు మంగ శ్రీను, సబ్బవరపు నారాయణమూర్తి, ఉగ్గిన గంగు నాయుడు, బోను నాయుడు, ఎడ్ల నాయుడు, నేబర్తి శ్రీనివాసరావు, కోన సంజీవరావు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు, జర్నలిస్టు రాపర్తి వెంకటరావు మూడవ వర్ధంతి సందర్భంగా సోమవారం తుమ్మపాల మెయిన్ రోడ్‌లో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ముందుగా ఆయన చిత్రపటానికి ఏపీ ఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, పడాల గణపతి రావు, గంగుపం జలజ, నడిపల్లి గణేశ్వరరావు తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సత్యనారాయణ, మొగసాల వెంకట్, గోవింద్, దేవుడు బాబు, గొంతిన శ్రీను, బొడ్డపాటి వెంకట సూరి, వెంకట్రావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధుల పింఛన్లు బ్యాంకు అకౌంట్లలో జమ

ప్రజాశక్తి- కె.కోటపాడు : వృద్ధాప్య, వికలాంగులకు పింఛన్లు లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్లకు నేరుగా జమ చేయడం జరుగుతుందని స్థానిక ఎంపీడీవో కే అప్పలరాజు తెలిపారు. సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో సచివాలయ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. బ్యాంక్ అకౌంట్ ఉన్నవారందరికీ ఒకటో తేదీనే పింఛన్లు జమ చేయడం జరుగుతుందని, బ్యాంక్ అకౌంట్ లేనివారికి నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులకు, వికలాంగులకు నేరుగా వారి వెళ్ళవద్దు పింఛను అందించడం జరుగుతుందని చెప్పారు. పింఛన్ దారులు ఆయా గ్రామ సచివాలయాలకు రానక్కర్లేదని, ఈ విషయం గ్రామాల్లో దండోరా ద్వారా తెలియపరచాలని కార్యదర్శులను ఆదేశించారు.

టెన్త్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి-మునగపాక : పదవ తరగతి ఫలితాల్లో మండలంలో ఉన్నత మార్కులు సాధించిన గ్రామానికి చెందిన విల్లూరి యామిని, భీసెట్టి గీత, టెక్కలి జయశ్రీ, ఆళ్ల అనుషాలను స్థానిక వెంకటేశ్వర గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ శరగడం పరదేశి నాయుడు, గణేష్ మాస్టర్, మాధవి, రాంబాబు, మురళి, అర్జున్, వెంకట్, అప్పారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని మేడిచర్ల గ్రామంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారు సోమవారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 75 మంది కంటి రోగులను పరీక్షలు చేయగా 36 మందిని కంటి ఆపరేషన్ ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ఆప్తలమిక్ ఆఫీసర్ దుర్గ భవాని, శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో ఆడినేటర్ సిహెచ్ అశ్వని కుమార్ నర్సింగ్ స్టాఫ్ దీపిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నివాసాలకు స్థలాలు అనువుగా లేక..

నిర్మాణాలకు నోచని గృహాలు

-రహదారి లేక అవస్థలు
- విద్యుత్ స్తంభాలు వేసి వదిలేసిన వైనం



నిరుపయోగంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని సీహెచ్. నాగాపురం, పాతకృష్ణదేవిపేట పంచాయతీలకు కేటాయించిన జగనన్న ఇళ్ల స్థలాలు నివాసాలకు అనువుగా లేక పోవడతో లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. ఈ రెండు పంచాయతీల్లో 178 మంది ఇళ్ల లబ్ధిదారులను గుర్తించి రెండేళ్ల క్రితం సిహెచ్.నాగాపురంలో జగనన్న ఇళ్ల స్థలాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ స్థలాలు అనువుగా లేవు. దీంతో చేసేది లేక 173 మంది లబ్ధిదారుల్లో సుమారు 10 మంది మాత్రమే పునాదులు తీశారు. అవి ప్రస్తుతం నిరుపయోగంగా వదిలేశారు. దీనికి తోడు ఈ స్థలాలకు ఆనుకొని శ్మశానం, మరో వైపు సాగునీటి చెరువు ఉంది.



కాలనీకి ఇదే రహదారి

సి హెచ్. నాగావురం గ్రామంలో 75 మంది లబ్ధిదారులకు, పల్లావూరు 25 మందికి, కుమారపురం 11 మందికి, పాతకృష్ణదేవి పేటలో 62 మందికి ఈ లబ్ధిదారులకు ఈ స్థలాల్లోనే పట్టాలు మంజూరు చేశారు. ఈ లేఅవుట్‌లో రూ.20లక్షలకు పైగా వెచ్చించి విద్యుత్ శాఖాధికారులు విద్యుత్ స్తంభాలు వేసి వదిలేశారు. స్థలాలు నివాసాలకు అనువుగా లేక చాలా మంది పట్టాలకే పరిమితమయ్యారు. వర్షాకాలంలో జగనన్న ఇళ్ల స్థలాలకు వద్దకు వెళ్లేందుకు సరైన రహదారి లేదు. కానీ చెరువు కాలువ ఉంది. దీనికి ప్రభుత్వం కల్వర్టు నిర్మించాల్సి ఉంది. పక్కనున్న చెరువులు నిండితే భారీ కల్వర్టు నిర్మించాల్సి ఉంది. గతంలో పక్కనున్న చెరువులు నిండితే పంట పొలాలు నీటి మునిగిన దాఖలాలు ఉన్నాయి. ఇటువంటి చోట సుమారు మూడెకరాలు ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు వెనుకంజ చేస్తున్నారు. స్థలాలను అనువుగా మార్పు చేయాలని వారు కోరుతున్నారు.



పిల్లర్ దశలో ఉన్న గృహ నిర్మాణం

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లి జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పాలకొండ నుండి భార్యాభర్తలు ఈగల గోపి, రేవతిలు పాప హేమవర్షిని తో కలిసి బైక్ పై రాచపల్లి వెళు తున్నారు. నక్కపల్లి జాతీయ రహదారిపై ఉపమాక వెంకన్న ఆర్చి జంక్షన్ వద్ద కు వచ్చే సరికి ఉపమాక నుండి వచ్చే మార్గం గుండా మోటూరు అప్పలరాజు, కిరణ్ కుమార్ (తండ్రి ,కొడుకు) బైక్ పై సడన్‌గా రోడ్డు పైకి రావడంతో రెండు బైకులు బలంగా ఢీకొన్నాయి. దీంతో ఈగల గోపి, పాప హేమవర్షిని, మోటూరు కిరణ్ కుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక పిహెచ్‌సిలో గాయపడ్డ వారికి ప్రథమ చికిత్సను అందించారు. మెరుగైన వైద్యం కోసం గోపి, కిరణ్‌కుమార్‌లను అనకాపల్లి ఎన్.టి.ఆర్ ఆసుపత్రికి తరలించారు.

52 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు

-తహశీల్దార్ వెంకటరమణ



ప్రజాశక్తి-కోటవురట్ల: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మండల ఎన్నికల జాబితా అధికారులు సిద్ధం చేశారు. మండల వ్యాప్తంగా 25 గ్రామాలకు గాను 52 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తహసిల్దార్ వెంకటరమణ తెలిపారు. మండల వ్యాప్తంగా ఓటర్లు స్త్రీలు 22,754, పురుషులు 21,705, ఉండగా, వృద్ధులకు వికలాంగులకు మండల వ్యాప్తంగా 45 మందిని గుర్తించి ఇంటి వద్ద ఓటు వేసే ఏర్పాట్లు చేసామన్నారు, అదేవిధంగా ఉద్యోగులకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఇంతవరకు 272 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల వారిగా ఓటర్ల వివరాలు..పాములవాకలో 2277, బికేపల్లి 1720, అన్నవరం 1531, ఎండపల్లి 1601, జల్లూరు 1152, రామచంద్రపాలెం 1386, నీలిగుంట 1054, పీకే పల్లి 1222, ఏ ఎస్ పేట 908, చిన్న బొడ్డేపల్లి 1059, కొడవటిపూడి 2482, వెంకటాపురం 3614, టీ జగ్గంపేట 618, తిమ్మాపురం 623, కైలాసపట్నం 1850, కోటవురట్ల 5804, లింగాపురం 1774, తంగేడు 2068, సుంకపూర్ 1428, రామన్నపాలెం 939, రాజుపేట 1797, చౌడువాడ 1660, గొట్టువాడ 1361, ఆర్ సి పురం1162, పందూరులో 1552 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న అనిత

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- నక్కపల్లి:తెలుగుదేశం పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని పాయకరావుపేట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని గొడిచెర్ల, నెల్లిపూడి, ఎన్ నరసాపురం, చినతీనార్ల గ్రామాలకు చెందిన పలువురు టిడిపిలో చేరారు. ఈ మేరకు సోమవారం నక్కపల్లి క్రిష్ టౌన్ షిప్ నందు ఆమె స్వగృహంలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి సాధారంగా పార్టీలోకి ఆహ్వానించారు. గొడిచెర్ల నుండి 60 కుటుంబాలు, నెల్లిపూడి, ఎన్.నరసాపురం గ్రామాల నుంచి 20 కుటుంబాలు, చిన తీనార్ల గ్రామం శెట్టిబలిజ పేటకు చెందిన పలువురు వైసీపీని వీడి టిడిపిలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, నాయకులు కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి బుజ్జి, వైబోయిన రమణ, గరికిని నూకరాజు పాల్గొన్నారు.

ఆదివాసీ గిరిజన సంఘం నేత అరెస్టు అన్యాయం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:ఎన్నికల ప్రచారంలో బాగంగా అనకాపల్లి జిల్లా చోడవరంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటన నేపథ్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్‌ను జి మాడుగుల మండలం మద్దులపంద గ్రామంలో పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్ కు తరలించడం అన్యాయమని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవి ఖండించారు. సోమవారం అరకులోయలో స్థానిక విలేకరులతో మాట్లాడారు.ఆదివాసి ఉద్యమ నాయకులపై నిర్బంధం సరికాదన్నారు.రాష్ట్రంలో వైసీపీకి ఓటమి భయం పట్టిందని, అందుకే ఉద్యమ నాయకులను, కార్యకర్తలను అక్రమ అరెస్టులు చేస్తుందని ధ్వజమెత్తారు.

మాడుగుల అభివృద్ధికి కృషి

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ

ప్రజాశక్తి - మాడుగుల: మాడుగులను మోడ్రన్ మాడుగులుగా చేస్తానని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ, అతి తక్కువ కాలంలోనే గ్రామీణ ప్రాంతాలలో ఎన్నో మౌలిక సదుపాయాలు కల్పించి బూడి ముత్యాలనాయుడు అభివృద్ధి చేశారన్నారు.వైసీపీ ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన మేనిఫెస్టోను వివరించారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలేవి నెరవేర్చకుండా నూతనంగా కల్లబొల్లి హామీలతో ప్రజలను మాయ మాటలు చెప్పి మభ్యపెట్టే దిశగా టీడీపీ నేతలు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నడూ లేనివిధంగా నవరత్నాలు తో సహా అనేక సంక్షేమ పథకాలు అందిస్తూ, వాటిని 99 శాతం అమలు చేస్తూ మరింత మంచి పనులకు శ్రీకారం చుట్టిన వైసీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. ఆమె వెంట ఎంపీపీ తాళ్లపురెడ్డి వేంకట రాజా రామ్, మాజీ ఎంపీపీ రామధర్మజా, మండల కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీను, గ్రామల ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారం చేపడుతున్న అనురాధ


మూతపడిన చలివేంద్రం

ఇదీ పంచాయతీ అధికారుల ఏర్పాటు చేసిన చలివేంద్రం దుస్థితి

ప్రజాశక్తి-గొలుగొండ:ఏజెన్సీ ముఖ ద్వారం గొలుగొండ మండలం ఏకైక మేజర్ పంచాయతీ ఏఎల్ పురం గ్రామంలో అధికారులు ఏర్పాటు చేసిన చలివేంద్రం మూడు రోజుల ముచ్చటగానే మూతబడింది. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా కొన్ని రోజుల క్రితం పంచాయతీ అధికారులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. నీరు పోయక కొద్ది రోజులుగా చలివేంద్రంలో ఖాళీ కుండ దర్శనమిచ్చింది. మండుటెండలు తగ్గే వరకు చలివేంద్రాన్ని సక్రమంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పలువురు అంటున్నారు.



ఖాళీగా ఉన్న చలివేంద్రం




ప్రచారం చేపడుతున్న అయ్యన్న

అయ్యన్న ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-గొలుగొండ:రాష్ట్రం బాగు కోసం కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకోవాలని మాజీ మంత్రి, నర్సీపట్నం ఎన్డీఏ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు కోరారు. సోమవారం మండలంలోని కొత్తఎల్లవరం గ్రామంలో ఎన్నికల శంఖారావం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ రాష్ట్రంలో దోపిడీలు, దౌర్జన్యాలు పెరిగాయి తప్పా అభివృద్ధి జాడ కానరాలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్ కోసం కూటమికి పట్టం కట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సెక్టార్ అధికారుల పాత్ర కీలకం

ప్రజాశక్తి-పాడేరు: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమని అరుకు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో వి .అభిషేక్ స్పష్టం చేశారు. ఐటిడిఏ కార్యాలయం సమావేశ మందిరంలో, పాడేరు, అసెంబ్లీ నియోజకవర్గం సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, ఈవీఎంలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈవీఎంలు సక్రమంగా పని చేయకుంటే వెంటనే స్పందించి సంబంధిత పరికరాన్ని మార్చాలని సూచించారు. పోల్ పర్సంటేజ్‌పై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభించి సాయంత్రం నాలుగు గంటలకు ముగించాలని చెప్పారు. సమా వేశంలో ఎస్‌డిసి వి.వివిఎస్ శర్మ, తహసిల్దారులు పాల్గొన్నారు.



ప్రచారం చేపడుతున్న గంగాధర్

కాంగ్రెస్ అభ్యర్థి గంగాధర్ ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి: మండలంలోని కొత్తూరు పంచాయతీ పరిధి రామాపురం, రామభద్రపురం గ్రామాలలో అనకాపల్లి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఐఆర్ గంగాధర్ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్రానికి ప్రత్యేక హెూదా తెస్తానని రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని నమ్మించి గద్దె నెక్కిన సీఎం జగన్ నేడు రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కేంద్ర బిజెపికి తాకట్టు పెట్టారని విమర్శించారు. నిధులు రాబట్టడంలో జగన్ వైఫల్యం చెందారని ఆరోపించారు. టిడిపి, బిజెపి, జనసేన కూటమి అభ్యర్థులను, వైసిపి అభ్యర్థులను ఓడించాలన్నారు. రాష్ట్రాన్ని, దేశాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎగ్గాడ భాస్కర్ రావు, దాసరి సంతోష్, సనేడ గజ్జాలు, కొల్లి సత్యారావు, నంది విజయ్ కుమార్, పూజారి నర్సయ్య పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయండి

- గాజువాకలో కార్మిక ప్రదర్శన, బహిరంగ సభ

సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ కార్మిక వర్గానికి విజ్ఞప్తి చేశారు. 138 సంవత్సరాల క్రితం 8 గంటల పని దినం కోసం పెద్ద ఎత్తున కార్మికులు పోరాడారని గుర్తుచేశారు. తమ ప్రాణాలు త్యాగం చేసి 8 గంటల పని దినాన్ని సాధించుకున్నారని తెలిపారు. నేడు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకువచ్చిందని పేర్కొన్నారు. వీటి వల్ల కార్మికులు సంఘం పెట్టుకునే హక్కు, బేరసారాలు ఆడే హక్కు, సమ్మె చేసే హక్కు కోల్పోతారని వివరించారు. పాలకవర్గాలు కార్మిక హక్కులను కాలరాస్తూ, కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు, కార్మిక హక్కుల రక్షణకు మే డే స్ఫూర్తితో మరిన్ని పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మే డే రోజు ఉదయం 6 గంటల నుంచి అన్ని పరిశ్రమల వద్ద పని ప్రదేశాలలోనూ, నివాస ప్రాంతాలలోనూ, ఆటో స్టాండ్‌లలోను మేడే పతాకావిష్కరణ, సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు గాజువాక శ్రీ కన్య సినిమా హాల్ జంక్షన్ నుంచి పాత గాజువాక జంక్షన్ వరకు కార్మిక ప్రదర్శన, బహిరంగ సభ ఉంటాయని, కార్మిక వర్గం యావన్మంది పాల్గొని విజయవంతంచేయాలని కోరారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా పార్వతీశం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఎంవి పార్వతీశం ఎన్నికయ్యారు. సోమవారం బార్ అసోసియేషన్ సమావేశమందిరంలో జరిగిన న్యాయవాదుల సంఘం ఎన్నికల్లో ఎన్ జనార్ధనరావుపై పార్వతీశం గెలుపొందినట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఎస్ వాయునందన తెలిపారు. ఈ ఎన్నికల్లో కార్యదర్శిగా ఎన్ సూరిబాబుపై కెఎస్ఎం సుధాకర్ గెలుపొందినట్లు తెలిపారు.



కోశాధికారిగా ముమ్మిడిశెట్టి సునీల్, ఉపాధ్యక్షునిగా బమ్మిడి సూర్య నారాయణ, సంయుక్త కార్యదర్శిగా బోర సూర్య ప్రకాశరెడ్డి, కార్య నిర్వాహకసభ్యులుగా బి అప్పలరాజు, వి అరుణకుమారి, వై నరసింగరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

నిజాయితీగల నాయకులనే గెలిపించండి

-సిపిఎం, సిపిఐ అభ్యర్థుల విజయానికి కృషి చేయండి

-ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్



మాట్లాడుతున్న చలసాని శ్రీనివాస్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే నాయకులకు ఓట్లు వేయాలని, పార్టీ ఏదైనా నీతి నిజాయితీ కలిగిన అభ్యర్థులను మాత్రమే గెలిపించాలని, ముఖ్యంగా సిపిఎం, సిపిఐ అభ్యర్థుల విజయానికి కృషిచేయాలని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల హక్కులు, ఆత్మగౌరవ యాత్ర సందర్భంగా యాత్ర ఉద్దేశాలను వివరించడం కోసం సోమవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రత్యేక హోదా, రాష్ట్ర విభజన హామీల అమలుకు కృషి చేసే నాయకులను మాత్రమే గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర విభజన కాలంలో బిజెపి ఆంధ్ర రాష్ట్రానికి మేలుకూర్చే విధంగా ప్రత్యేక హోదా, రాష్ట్ర విభజన హామీలు కచ్చితంగా అమలు చేస్తామని వాగ్దానాలు పలికి, 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మామీలను తుంగలో తొక్కిందన్నారు. మతతత్వం ,విభజించి పాలించు విధానాలతో బిజెపి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. విభజన తరువాత కూడా బిజెపి ప్రభుత్వం తెలుగు ప్రజల మీద విషం చిమ్ముతుందన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, జగన్మోహన్‌రెడ్డి తమ సొంత ప్రయోజనాల కోసం బిజెపికి ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. ఎందరో త్యాగమూర్తుల ఫలితంగా ఏర్పడిన విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరణ చేస్తుంటే అందరూ చూస్తూ ఊరుకుంటున్నారన్నారు.

విశాఖ ఉత్తరం నియోజకవర్గంలో జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి వివి లక్ష్మీనారాయణ, గాజువాక సిపిఎం అభ్యర్థి ఎం.జగ్గునాయుడు, పశ్చిమ సిపిఐ అభ్యర్థి ఎ.విమలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా ఇంటలెక్చువల్స్ ఫోరం అధ్యక్షుడు ప్రొఫెసర్ అప్పలనాయుడు,
ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ప్రతినిధి పి.బుల్లిరాజు, శ్రామిక యజ్ఞ సంఘటనల ప్రధాన కార్యదర్శి బురాడ యజ్ఞ నారాయణ, సమితి ప్రతినిధులు శివరాం, శాస్త్రి పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తున్న

బిజెపి అభ్యర్థి సిఎం.రమేష్‌పై చర్యలు తీసుకోవాలి

-జిల్లా ఎన్నికల అధికారికి సిపిఎం ఫిర్యాదు

ప్రజాశక్తి -అనకాపల్లి: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తున్న అనకాపల్లి బిజెపి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గంటా శ్రీరామ్, వివి.శ్రీనివాసరావు, అల్లు రాజు సోమవారం జిల్లా ఎన్నికల అధికారికి పిర్యాదు చేశారు. సిఎం.రమేష్ ఎన్నికల నిబంధనలను పూర్తిగా విస్మరించి ప్రచారం నిర్వహించడం, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, ఓటర్లకు తాయిలాలు పంచడం, కుల, మతాల ప్రాతిపదికన ప్రచారం, సమావేశాలు నిర్వహించడం చేస్తున్నారని తెలిపారు. ఓటర్లకు పంపిణీ చేస్తున్న కరపత్రాల్లో ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రచురణకర్త పేరు, ప్రింటింగ్ ప్రెస్ పేరు, ఎన్ని కాపీలు ముద్రించారనే వివరాలు ఉండాలని, కాని అలాగే సిఎం.రమేష్‌కు సంబంధించి కరపత్రాల్లో ఎటువంటి వివరాలను ప్రచురించకుండా లక్షలాది కరపత్రాలు అనకాపల్లి పార్లమెంట్ మొత్తం పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే ఓటర్లను ప్రలోభ పెడుతూ బిజెపి ఎన్నికల గుర్తు కమలం పువ్వు ఆకారంతో విసనకర్రలను, కీ-చైన్లు ఇంటింటికీ ఓటర్లకు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. గ్రామాలలో కుల సంఘాలను, ఇతర మతాలను దూషించే విధంగా ప్రసంగాలు చేస్తూ ఉద్రిక్తతలకు తావునిచ్చే విధంగా వ్యవహరిస్తున్నారని వెల్లడించారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి వందలాది మంది స్థానికేతరులను ఎన్నికల ప్రచారం పేరుతో తీసుకు వచ్చి మద్యం, డబ్బు పంపిణీకి పాల్పడుతూ గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి, శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. స్వీట్ బాక్సులు పంపిణీ, మహిళా కోలాట దళాలకు బిజెపి ఎన్నికల గుర్తుతో కలిగిన పసుపు కుంకాలు పేరుతో చీరలు పంపిణీ చేస్తూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. సిఎం.రమేష్ ప్రచార రథాలుగా ఉన్న వాటికి ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పెద్ద పెద్ద డిజె సౌండ్ సిస్టమ్స్ ఎటువంటి అనుమతులు తీసుకోకుండా వాడుతున్నారని తెలిపారు. కొన్ని వాహనాలను సాధారణ సౌండ్ సిస్టమ్స్‌కు అనుమతి తీసుకుని డిజె సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేశారన్నారు. అటువంటి వాహనాలను వెంటనే నిలుపుదల చేయాలని కోరారు. ఇలా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తున్న సిఎం. రమేష్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పరిపాలనా రాజధానిగా విశాఖ

-వైసిపి ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జగన్మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పథకాలు అమలు జరుగుతాయని, పరిపాలన రాజధానిగా విశాఖపట్నం రానుందని విశాఖ పార్లమెంట్ వైసిపి అభ్యర్థి బొత్స ఝాన్సీ అన్నారు. జివిఎంసి 36వ వార్డులో సోమవారం దక్షిణ వైసిపి అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్‌తో కలిసి ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొత్స ఝాన్సీ, వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మరోసారి విజయం సాధించి, విశాఖలో ప్రమాణస్వీకారం చేస్తారన్నారు. పూర్ణా మార్కెట్ నుంచి ప్రారంభించిన ప్రచార కార్యక్రమంలో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, వైసిపి జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, 36వ వార్డు కార్పొరేటర్ మేరీ జోన్స్, పార్టీ సీనియర్ నాయకుడు మాసిపోగు రాజు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఎవిఎన్ కాలేజీ రోడ్డు, చిన్నరెల్లి వీధి,రెల్లి వీధి వరకు ప్రచార ర్యాలీ సాగింది.



ప్రచారంలో పాల్గొన్న బొత్స ఝాన్సీ, వాసుపల్లి

నేడు పలు ప్రాంతాల్లో నీటి సరఫరా బంద్

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి ఆరోజోన్ గాజువాక ,శ్రీనగర్, వై.జంక్షన్ వద్ద పగిలిన ప్రధాన తాగునీటి సరఫరా పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా ఈ నెల 30న నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

64వ వార్డు వెంకన్నపాలెం ,సత్యనారాయణపురం, యాతపాలెం, గోడ్డువాని పాలెం, అశోక్‌నగర్, 65వ వార్డు: వికాస్ నగర్ ,జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ, బాలాజీ తోట, ప్రియదర్శిని కాలనీ, 70వ వార్డు శ్రామికనగర్, చట్టివానిపాలెం, దశమి కొండ, 71వ వార్డు కుంచమాంబ కాలనీ, దత్తసాయి నగర్, దిబ్బపాలెం, 72వ వార్డు చిన్నగంట్యాడ ,చైతన్య నగర్, మెహర్‌నగర్, 73వ వార్డు గొంతినివానిపాలెం, 74 వ వార్డు దయాల్ నగర్, పైడిమాంబ కాలనీ, అంబేద్కర్ నగర్, టిజిఆర్ నగర్, నెహ్రూ నగర్, వియ్యపువాని పాలెం, 75వ వార్డు పెద్ద గంట్యాడ, దుర్గవానిపాలెం, అయ్యన్నపాలెం, నెల్లిముక్కు, సీతానగరం, సిద్దేశ్వరం, 76వ వార్డు: నడుపూరు, హెచ్‌బి కాలనీ,డెయిరీ కాలనీ, రిక్షా కాలనీ, గాంధీ నగర్, రామచంద్రనగర్ తదితర ప్రాంతాల్లో కుళాయిల్లో తాగునీటి సరఫరా నిలిపేయనున్నట్లు తెలిపారు. అత్యవసర ప్రదేశాల్లో ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామన్నారు.

'విధి నా సారథి' చిత్రానికి శ్రీకారం

ప్రజాశక్తి -గాజువాక: గాజువాక మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాజువాక జీమ కార్యాలయంలో సోమవారం 'విధి నా సారథి' అనే లఘు చిత్రానికి పూజా కార్యక్రమం నిర్వహించారు. సిరసుపల్లి నూకరాజు క్లాప్ కొట్టగా, గండేపల్లి అప్పారావు కెమెరా స్విచ్ఛాన్‌చేసి ప్రారంభించారు. చిత్రానికి రచన దర్శకత్వం దుబాయ్ రాజు, కెమెరామెన్ తిలక్, జిమా సభ్యులు పైడ్రాజు నూనెల, గుడివాడ శ్రీనివాసరావు, ఊక్కోటి వెంకటేశ్వరరావు (నాని) పూజారి అప్పలనాయుడు, ఇవిఆర్ ఆర్ట్స్ అధినేత ఇవిఆర్, సౌదీ సురేష్, జ్యోతికుమారి, కె.మంగ, బి. వరలక్ష్మి, నవీన్ తేజస్, సోముదేవ్ గాంధీ, షాట్ ఓకే జీవన్, సిరసపల్లి. వెంకటరమణ, గణేష్, శరత్, చిరంజీవి, అల్లు జోగిన్ పాల్గొన్నారు,

నిర్భయంగా ఓటేయండి : సిఐ

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎన్నికల సమయంలో ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని నాలుగో పట్టణ సీఐ ఎస్ విజయ్‌కుమార్ సూచించారు వెంకటేశ్వర స్వామి గుడి వద్ద శాంతియుత పోలింగ్, సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అపార్ట్‌మెంట్లలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తుల సంచారంపై పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు.